క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహ దాతలకు సత్కారం



అంబేడ్కర్ విగ్రహ దాతలను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలో అంబేడ్కర్ విగ్రహ దాతలను ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘంలోని కాంస్య విగ్రహ కమిటీ చైర్మన్ శ్రీకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ జడ్జి నెల్సన్ రాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం సుమారు 58 మంది దాతలకు ఘన సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో యాళ్ల హనోక్‌వర్దన్, రాజేష్, కె.శ్యామలరావు, కేసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు జలకళ



యనమదుర్రు వద్ద కాళీపట్నం చానల్ కాలువలో నిండుగా ప్రవహిస్తున్న నీరు

భీమవరం అర్బన్: ఈ ఏడాది ఇరిగేషన్ అధికారులు జూన్ 1న ఎగువున ఉన్న కాలువలు ద్వారా నీటిని విడుదల చేయడంతో మండలంలో ప్రధాన కాలువలైన కాళీపట్నం, లోసరి, వెంప ఛానల్‌లలో సాగునీరు నిండుగా ప్రవహిస్తూ కళకళలాడుతున్నాయి. గత ఏప్రిల్‌లో కాలువలు కట్టేయడంతో గ్రామాలలో రక్షిత మంచినీటి చెరువుల్లో నీరు లేక అడుగంటిపోయాయి. ఈ ఏడాది వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండటంతో చెరువులు, కాలువలు, పొలాలు ఎండిపోవడంతో గ్రామస్తులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందస్తు సార్వా సాగు కోసం ప్రతి ఏడాది లాగే కాలువల ద్వారా నీటిని విడుదల చేయడంతో గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి చినుకులు పడగానే నారుమడులు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తులు కిటకిట



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు, ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని సబ్ కలెక్టర్ చెప్పారు. ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని సూచించారు.

బీచ్‌లో సందర్శకుల సందడి



కేపీ పాలెం బీచ్‌లో సేదతీరుతున్న పర్యాటకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలి వచ్చారు. ఉదయం నుండి ఎండ విపరీతంగా కాయడంతో పాటు వేడిగాలులు వీస్తుండటంతో పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వర స్వామి,వేలాంకణీ మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

నేడు అయ్యప్ప ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పెంటపాడు: రావిపాడులో అయ్యప్ప ఆలయానికి సోమవారం ఉదయం 7 గంటలకు శంకుస్థాపన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

శరవేగంగా తాడేరు వంతెన పనులు

- ఎమ్మెల్యే గ్రంధి చొరవతో రూ.2.30 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం
- భీమవరం, నర్సాపురం నియోజకవర్గాల ప్రజలకు మార్గం సుగమం



తాడేరు వంతెన పనులు జరుగుతున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం తాడేరు గ్రామాల కలుపుతూ మురుగు కాలువపై తాడేరు వంతెన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 1929లో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరడంతో నూతన వంతెన అవసరం ఉందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మొదట రూ.1.90 కోట్ల నిధులను మంజూరు చేయించారు. అయితే గత తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు కాంట్రాక్టర్లకు పెద్ద ఎత్తున బకాయిలు పెట్టడంతో వంతెన పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందు రాలేదు. సుమారుగా ఎనిమిది సార్లు ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచింది. అయినప్పటికీ కాంట్రాక్టర్లు రాలేదు. వంతెన నిర్మాణానికి అంచనాలు పెరిగిపోయాయి. దీంతో ఎమ్మెల్యే మళ్లీ గ్రంధి శ్రీనివాస్ మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రూ.2.30 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వేగంగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు శరవేగంగా జరిగేలా అధికారులతో సమీక్షలు చేస్తున్నారు.

వంతెన నిర్మాణం పట్టించుకోరు కానీ.. రాజకీయాలకు వాడుకున్నారు

2009 నుంచి 2019 వరకు పదేళ్లపాటు అధికారంలో ఉన్న అప్పటి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, భీమవరం మున్సిపల్ మాజీ చైర్మన్, జిల్లా జనసేన అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, రాజ్యసభ మాజీ సభ్యురాలు, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మీ వీరెవరూ తాడేరు వంతెనను పట్టించుకోలేదు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వంతెన నిర్మాణానికి చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయిస్తే నిర్మాణం ఆలస్యం అవుతోందంటూ టీడీపీ, జనసేన రాజకీయ కుట్రలు చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వంతెన వల్ల ప్రజలకు ఎంతో మేలు

తాడేరు వంతెన నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే భీమవరం, నర్సాపురం నియోజకవర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. భీమవరం నుంచి నర్సాపురం, వెంప, ముత్యాలపల్లి మీదుగా మచిలీపట్టణం జాతీయ రహదారికి చేరుకోవడానికి ఈ తాడేరు వంతెన దాటాలి. అలాగే అన్ని రంగాల్లో ముందంజలో ఉండడంతో పాటు నూతనంగా జిల్లా కేంద్రమైన భీమవరానికి నర్సాపురం నియోజకవర్గం ప్రజలు, అలాగే కొనసీమ జిల్లా ప్రజలు కూడా వయా నర్సాపురం, తాడేరు మీదుగా సులభంగా చేరుకోవడానికి ఈ వంతెన ఎంతో ఉపయోగపడుతుంది.

ప్రజల కోసం వంతెన నిర్మాణం



శిథిలావస్థలో ఉన్న తాడేరు వంతెన దుస్థితి చూసి నూతన వంతెన నిర్మాణం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వంతెన మంజూరు చేయించాను. ఈ వంతెన పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. మొదటిసారి నిధులు మంజూరు అయినప్పుడు అప్పట్లో చంద్రబాబు నాడు పెట్టిన బకాయిలకు భయపడి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. పెరిగిన అంచనా వ్యయం మేరకు మళ్లీ వంతెన నిర్మాణం కోసం నిధులు తీసుకురావడం జరిగింది. శంకుస్థాపన చేసే లోపే జనసేన, టీడీపీ నాయకులు ఈ వంతెనను రాజకీయాల కోసం వాడుకున్నారు. చిత్తశుద్ధితో పనిచేసి వంతెన నిర్మాణం పూర్తి చేస్తాం.

– గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్యే, భీమవరం

సీబీఎస్ఈ శిక్షణ తరగతుల ప్రారంభం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగనాథరాజు

సాక్షి, భీమవరం: పట్టణంలోని భారతీయ విద్యా భవన్స్ స్కూల్లో వివిధ పట్టణాలకు చెందిన సుమారు 520 మంది స్కూల్ టీచర్లకు సీబీఎస్ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే, భవన్స్ చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నోబుల్ బహుమతి లాంటిదన్నారు. దేశ ప్రథమ పౌరుడైనా, ప్రధాన మంత్రి అయినా టీచర్ దగ్గర ఓనమాలు నేర్చుకోవాల్సిందేనని తెలిపారు. విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థి అడిగిన ప్రతి సందేహాన్ని ఓపికగా నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భావన సొంకాంబే, రిసోర్స్ పర్సన్ డాక్టర్ అనురాధ బాలరామ్, ప్రిన్సిపల్ ఎల్‌వీ రమాదేవి, చెరుకువాడ నరేష్, సెక్రటరీ కృష్ణంరాజు, భవన్ సంచాలకులు డాక్టర్ బీవీ శేషగిరిరావు, వివిధ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, టీచర్లు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను పదవి నుంచి తొలగించాలి

సాక్షి, భీమవరం: రెజ్లర్లతో అసభ్యంగా ప్రవర్తించిన ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రకాశంచౌక్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి నాయకులు మాట్లాడారు. రెజ్లర్లపై ఎంపీ ప్రవర్తన దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి ఎంపీని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.బలరాం, సీహెచ్ రంగారావు, గంటా సుందర్‌కుమార్, అనపర్తి కృష్ణప్రసాద్, యు.సుజాత, ఆర్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



బహుమతులు అందజేస్తున్న డీఈఓ వెంకటరమణ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సుజాతరాణి



ఆకివీడులో ధ్రువపత్రాలతో విద్యార్థులు

సాక్షి, భీమవరం: భీమవరంలోని వైఎస్సార్ శాఖ గ్రంథాలయంలో 34 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. డీఈవో ఆర్.వెంకట రమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వేసవి సెలవుల్లో బాలలకు ఉపయోగపడేలా ప్రభుత్వం విజ్ఞాన వేసవి శిబిరాలను నిర్వహించిందన్నారు. శిబిరాల్లో భాగంగా భీమవరం గ్రంథాలయంలో 126 మంది బాలలకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో రీడర్స్ ఫోరమ్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, గ్రంథాలయ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, కలిగొట్ల గోపాలశర్మ, డి.నాగేశ్వరరావు, డి.శ్యామల, పి.పద్మ, బి.శ్యామల, భవానీ శీతల్, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో సత్‌ప్రవర్తన

ఆకివీడు: సత్‌ప్రవర్తనకు మంచి పుస్తకాలు మార్గం చూపుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభ ఆదివారం జరిగింది. కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలు మేధస్సుకు నిలయాలన్నారు. జ్ఞాన సంపదతో పుస్తక భాండాగారాలు నిండి ఉంటాయన్నారు. ప్రతి పుస్తకం ప్రతి వ్యక్తి జీవితంలో మార్పు తీసుకువస్తుందన్నారు. ఒక్క సిరా బొట్టు లక్షల మెదళ్లను కదిలిస్తే, ఒక్క పుస్తకం కోట్ల మందికి జ్ఞానోదయం కల్గిస్తుందని చెప్పారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి గ్రంథాలయాలకు వెళ్లి విలువైన పుస్తకాల్ని చదివి, వారి కాలానికి విలువనివ్వాలని పిలుపునిచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థుల్లో నూతనోత్సాహం నింపిందన్నారు. ప్రతి రోజూ నేర్చుకున్న ప్రతి అంశం వారి జీవితంతో అడుగులు వేస్తుందన్నారు. విద్యార్థులు నేర్చుకున్న పాఠాలు, పద్యాలు, పాటలు, నృత్యాలను సభికుల ముందు ప్రదర్శించారు. అనంతరం వారికి ధ్రువపత్రాల్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోటుపల్లి శ్రీనివాసరావు శాఖా గ్రంథాలయానికి ఇన్వెర్టర్‌ను బహూకరించారు. రీడర్స్ ఫోరం అధ్యక్షులు దాసరి సత్యనారాయణ, అడ్వకేట్ నెల్లి సతీష్, లయన్స్ ప్రతినిధులు జిక్కి, అహ్మద్, లియో క్లబ్ అధ్యక్షులు ఎస్.వైభవి, ప్రముఖ రచయిత పుచ్చకాయల బ్రహ్మాజీ, విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు కాకర్ల రాజరాజేశ్వరి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్ నిమ్మల నాగు, శిబిర శిక్షకులు కిషోర్, సత్య, జాకీర్, షరీఫ్, మహ్మద్ గయాసుద్దీన్, జబీనా, గ్రంథాలయ అధికారిణి కే.పార్వతి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

విజేతలకు బహుమతుల అందజేత

ఉండి: వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా యండగండి శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ ఎంపీపీ దత్తాల సుజాతరాణి హాజరై 35 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో వివిధ కార్యక్రమాల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరంలో మాత్రమే కాకుండా ప్రతిరోజూ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. మనకు తెలియని ఎన్నో విషయాలు గ్రంథాలయంలోని పుస్తకాల్లో మనకు లభిస్తాయన్నారు. సమయం దొరికిన ప్రతి సారి గ్రంథాలయానికి రావాలని అన్నారు. 35 రోజుల పాటు ఎన్నో ఆటలు, అనేక విషయాలు నేర్చుకున్న ప్రతి విద్యార్థిని ఆమె అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్, గ్రంథాలయ అధికారి ఎస్‌సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న భీమవరం ఎంపీడీఓ వెంకటలక్ష్మి



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీరవాసరం ఎంపీడీఓ జ్యోతి

సాక్షి, భీమవరం: అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సూచించారు. బుట్టాయిగూడెం మండలం నుంచి భీమవరం ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన వెంకటలక్ష్మి, కొయ్యలగూడెం నుంచి వీరవాసరం ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన కుంజా జ్యోతి ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. మండల పరిషత్ అధికారులు ప్రతి గ్రామాన్ని కూడా ప్రభుత్వ లక్ష్యం మేరకు అభివృద్ధి చేసే విధంగా క్షేత్రస్థాయిలో ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయాలని సూచించారు. గ్రామాలలో డ్రెయినేజీ, సీసీ రోడ్లను పూర్తిస్థాయిలో నిర్మించడం జరుగుతుందని, ఎంపీడీవో స్థానంలో ఉన్న అధికారులు ప్రతిరోజు కూడా గ్రామాలలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అదే మాదిరిగా ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా జరిగే విధంగా ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చినమావుళ్లమ్మ గుడిలో అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న సీఐ నాగప్రసాద్

భీమవరం (ప్రకాశం చౌక్): భక్తులకు అన్నప్రసాద వితరణ మంచి కార్యక్రమం అని భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ అన్నారు. పట్టణంలోని రామరాజు తోటలో కొలువైన శ్రీచినమావుళ్లమ్మ అమ్మవారి 38వ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐ నాగప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నసమారాధన ప్రారంభించి భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించి ముగింపు సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం అభినందనీయమన్నారు. దైవ కార్యక్రమంలో పాల్గొడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో సేవా సమితి వారు మున్ముందు మరింత వైభోగంగా అమ్మవారి జాతరను నిర్వహించాలని కోరుకుంటున్నానన్నారు. అమ్మవారి సేవా సమితి అధ్యక్షులు రామాయణం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రేవూరి గోగురాజు, సభ్యులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అ'పూర్వ' సమ్మేళనం



కాళ్ల హైస్కూల్లో సమావేశమైన 1987-88 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కాళ్ల: సుమారు 36 ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలిశారు. కాళ్ల హైస్కూల్‌లో 1987–88 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు హైస్కూల్‌లో కలిసి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులు హాజరవడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. వివిధ వృత్తులు ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానించారు. వయసుని సైతం పక్కన పెట్టి వినోద కార్యక్రమాల్లో పాల్గొని గీతాలాపన చేస్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మరొకసారి కలుద్దాం అంటూ ఒకరికొకరు ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన బండారు ఫణి భోగయ్య, డి.పురుషోత్తం, గనిశెట్టి బాబ్జి, బేతు రాంబాబు, చిన్నం జాన్ మోజెస్, ముత్యం శేఖర్‌బాబు, షేక్ శ్రీను, కోటి సుబ్బారావు, గనిశెట్టి రంగారావులను తోటి విద్యార్థులు అభినందించారు.

నూతన జాతీయ విద్యావిధానంపై అవగాహన

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కళాశాల ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిషు బోధన నూతన విద్యావిధానాన్ని అధ్యాపకులు తప్పనిసరిగా అమలు చేయాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. గత కొన్ని రోజుల నుంచి పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిషు అధ్యాపకులకు నిర్వహిస్తున్న మొదటివిడత శిక్షణ శనివారం సాయంత్రం ముగించారు. ఈ సందర్భంగా ముగింపు సమావేశంలో పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంగ్లిషు బోధనలో మెలకువలు అధ్యాపకులు తప్పని సరిగా తెలుసుకోవాలన్నారు. ఈ శిక్షణలఓ పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాలోని 9 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన 39 మంది లెక్చరర్లు ఈ శిక్షణలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రిసోర్స్‌సెంటర్ కో ఆర్డినేటర్లు, మాస్టర్ ట్రినర్స్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుంచి రెండో విడత శిక్షణ

అలాగే సోమవారం నుంచి కళాశాల అధ్యాపకులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం స్థానిక పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 12 నుంచి 17 వరకు జరిగే శిక్షణలో అధ్యాపకులు తప్పక పాల్గొని నూతన విద్యావిధానంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

సమ్మర్ క్రికెట్ టోర్నీ విజేత 'తణుకు'

తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురంలో డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. మొత్తం 39 టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొనగా, ఆదివారం తణుకు – జగన్నాథపురం మధ్య జరిగిన పోటీలో తణుకు విన్నర్‌గాను, జగన్నాథపురం రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా ఎంపీపీ పానుకుమాటి శేషులత మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తాయని, క్రీడలపై యువత దృష్టి సారించాలన్నారు. అనంతరం టోర్నమెంట్ విజేత టీమ్‌కు రూ.20వేలు నగదు బహుమతి, ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో నవాబు పాలెం సొసైటీ డైరెక్టర్ చిట్టూరి బాపన్న, మాజీ డైరెక్టర్ పోసిన శ్రీను, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ, పానుకుమాటి శ్యామ్‌బాబు, నీలం నరసింహమూర్తి, యూత్ ప్రెసిడెంట్ కండెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి దుస్తుల పంపిణీ



కుప్పనపూడిలో వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న పీవీఎల్

ఆకివీడు: సేవా కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు అధిక ప్రాధాన్యతనివ్వాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారానే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అన్ని విధాలుగా సేవలందించాలని సూచించారు. వలంటీర్లు చేస్తున్న సేవల్ని ప్రజలు, అన్ని పార్టీలు హర్షిస్తుంటే, టీడీపీ ఈర్ష్య చెందుతోందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మెంటే లక్ష్మణరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, మోటుపల్లి గంగాధరరావు, మన్నే పోతరాజు, మోరా జ్యోతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు రాములోరి విగ్రహ ప్రతిష్ఠ





ధాన్యాధివాసంలో శ్రీగణపతి శ్రీసీతారామచంద్రస్వాముల విగ్రహాలు, విగ్రహ ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న భక్తులు

యలమంచిలి: ఏనుగువానిలంక పంచాయతీ పల్లిపోలవరంలో నూతనంగా నిర్మించిన శ్రీ గణపతి శ్రీ సీతారామచంద్ర పరివార దేవతా నూతన ఆలయంలో సోమవారం విగ్రహ, యంత్ర, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ మన్నే కుమారస్వామి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ వారి రూ.10 లక్షల ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయం నిర్మించినట్లు ఆయన వివరించారు. ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా ఆదివారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మార్జనలు, పంచగవ్యప్రాశన, వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తు బలి, ధాన్యాధివాసం తదితర పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం పూజలు నిర్వహించి 7 గంటల 29 నిమిషాలకు విగ్రహ, యంత్ర, శిఖర ప్రతిష్ఠ జరుగుతుందని కుమారస్వామి చెప్పారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేసినట్లు చెప్పారు.

ముగిసిన నరసింహుని కల్యాణోత్సవాలు



కొంతేరు శ్రీకుంతీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అఖండ అన్నసమారాధన

యలమంచిలి: కొంతేరులో ఉన్న శ్రీ కుంతీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు సందర్భంగా ఆదివారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ఆధ్వర్యంలో అర్చకులు మాధవాచార్యులు దేవేరులకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి అన్నదాన కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తుల సహకారంతో అన్నసమారాధన జరిపారు. కొంతేరు పరిసర గ్రామాల నుంచి సుమారు 800 పైగా భక్తులు ఆలయానికి వచ్చి దేవేరులను దర్శించుకుని, నవకాయ పిండి వంటలతో వడ్డించిన స్వామి ప్రసాదం స్వీకరించారు. ఈ అన్నసమారాధనతో వార్షిక కల్యాణోత్సవాలు ముగిశాయని ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాస్ వివరించారు.